

21న డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డీఈఈ సెట్‌లో అర్హత సాధించి నేటికీ ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులకు ఈనెల 21న నగరంలోని డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన చేస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ చెప్పారు. ఈనెల 23 నుంచి ఫేజ్ 1 కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23నుంచి 26వరకు వెబ్ ఆప్షన్లు, 30న ఫీజు చెల్లింపులు, సీట్ అలాట్‌మెంట్, 30నుంచి నవంబరు 4వరకు రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

చందమామ రావే.. జాబిల్లి రావే...



పున్నమి చంద్రుడి పూర్ణబింబాన్ని చూడటం ఎవరికైనా ఒక పరవశం. ఆ వేళ.. లోకమంతా పరుచుకునే వెండి వెన్నెలను అనుభవించడం ఒక తాదాత్మ్యం. చిమ్మ చీకటిని పారదోలి ప్రకృతి అందాలను ధగధగా మెరిపించే నిండు చంద్రుడు ఎవరికైనా మోహమే. అందుకే కవులు 'మామా.. చందమామా..' అని ప్రేమగా పలకరించారు. 'చలువ చందనములు పూయ చందమామ రావే.. జాజి పూల తావినీయ జాబిల్లి రావే..' అంటూ ఆహ్వానించారు. ప్రకృతిలో ఏ సృష్టికీ దక్కని ప్రేమను, మోహాన్ని సొంతం చేసుకున్నది ఒక్క చందమామేనేమో. జలరాశి చెంతన నిండు చంద్రుడు.. రెండు చంద్రులుగా మారి ఆకట్టుకుంటున్న ఈ దృశ్యం శుక్రవారం రాత్రి వైరా రిజర్వాయర్ వద్ద ఆవిష్కృతమైంది.

-ఆంధ్రజ్యోతి, వైరా



మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దాలి..

- విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి
- సెలవులు ఎక్కువగా పెట్టొద్దు..
- బ్యాక్‌బెంచ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- నూతన ఉపాధ్యాయులతో ముఖాముఖి

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల జీవితాలలో స్పష్టమైన మార్పు సాధించే దిశగా తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు మరింత బాధ్యత ఉంటుందని, బడుగు, బలహీన వర్గాల పిల్లలు అధికంగా మన పాఠశాలలో చదువుతారని, వీరిలో కసి పెంచి జీవితంలో పెద్ద స్థాయికి చేరేలా చూడాలని, పిల్లలు పెద్ద, పెద్ద ఆశయాలు పెట్టుకునేలా మన ఉపాధ్యాయులే నిరంతరం ప్రోత్సహిస్తూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో ఆశించిన స్థాయిలో మౌలిక వసతులు, పిల్లలు, తల్లిదండ్రుల నుంచి స్పందన రాకపోయినా నిరుత్సాహ పడకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల సామర్థ్యం ముందుగా పరీక్షించి దానిని పెంచేందుకు దృష్టి సారించాలని అన్నారు. ఉపాధ్యాయులు వర్క్ లైఫ్ బ్యాలెన్స్ చేయాలని, అరత ఉన్న సెలవులను పూర్తిగా వినియోగించుకోవచ్చని, అంతకుమించి సెలవులు పెట్టవద్దని అన్నారు. ప్రతి పాఠ్యాంశం విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన పద్ధతులు అలవర్చుకోవాలన్నారు. తన చిన్నతనంలో 7వ తరగతి వరకు బ్యాక్ బెంచ్ స్టూడెంట్‌గా ఉన్నానని, అప్పుడు విజయలక్ష్మి టీచర్ పెట్టిన శ్రద్ధ కారణంగా తాను నేడు కలెక్టర్‌గా ఉన్నానని కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయులు బ్యాక్ బెంచ్ స్టూడెంట్‌పై శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ కోరారు. పేరెంట్స్‌తో జవాబుదారీతనంగా పని చేయాలని అన్నారు.

జడ్పీ సీఈవో దీక్షా రైనా మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను మెరుగుపరచడం కోసం ఉపాధ్యాయులు చేసే పనులు గొప్ప ఫలితాలు సాధిస్తాయని, మన దగ్గర చదివే పిల్లలను సొంత పిల్లలుగా భావించాలన్నారు. డీఈవో సోమశేఖర శర్మ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ప్రభుత్వం 516మందిని డీఎస్సీ-2024 ద్వారా ఎంపికయ్యారని, వీరిలో 481మంది విధుల్లో చేరారని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన జీవితం అందించడంలో ఈ ఉపాధ్యాయులు ఎంతో తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఆర్ఎంవో రాజశేఖర్, ఏఎంవో రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, నూతన ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2, 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


- మొత్తం 87 పరీక్ష కేంద్రాలు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

6

పరేషాన్.. ఎడ్యుకేషన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం లక్ష్యం పక్కదారి పడుతోంది ప్రతీ ఏటా పేద విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, మెస్‌చార్జీలు క్రమం తప్పకుండా చెల్లించాల్సి ఉండగా గత ప్రభుత్వం బకాయిలు పెండింగ్ ఉండడంతో పేరుకుపోయాయి. ఉమ్మడిజిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు రూ.100కోట్లపైనే ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉంది. ప్రతినెలా ఆయా సంక్షేమశాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపడం, బడ్జెట్ రేపోమాపో వస్తుందని ఎదురుచూడడం తప్ప విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాత్రం కాలేజీలకు రావడంలేదు.





- ఉమ్మడి జిల్లాలో రూ.125 కోట్ల పైనే పెండింగ్
- భద్రాచలం ఐటీడీఏ నుంచే రూ.50 కోట్ల బకాయిలు
- ఏడాదికేడాది పేరుకుపోతున్న బకాయిలు
- మొత్తం ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తున్న యాజమాన్యాలు
- ఆర్థికభారంతో సతమతం అవుతున్న విద్యార్థులు

పేద విద్యార్థులకు ఫీజు గండం



2021-22 నుంచి జాడలేని 'ఫీజు రీయింబర్స్‌మెంట్'

ఖమ్మం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లిస్తుండగా, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు 10వేల లోపు ర్యాంకు వస్తే ఇంజనీరింగ్ పూర్తి ఫీజులు చెల్లిస్తున్నారు. 10వేల ర్యాంకు దాటిన వారికి రూ.30వేల వరకు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. 10వేల ర్యాంకు లోపు వస్తే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో రూ.లక్షపైగా ట్యూషన్ ఫీజు ఉంటే మొత్తం ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజులు ప్రభుత్వం జమచేస్తుంది.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య ఆర్థికభారం కాకుండా సాగాలని గత కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రభుత్వం అమలుచేస్తున్నారు. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రూ.125 కోట్లకుపైగా బకాయిలు రావాల్సి ఉంది. గడిచిన 2021-22 నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ శాఖల ద్వారా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడంలేదు. దీంతో చదువులు పూర్తయిన తర్వాత టీసీలు, మెమోలు ఇవ్వాలంటే ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి మొత్తం ఫీజు కట్టించుకుని ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే, ఆ తర్వాత మీ డబ్బులు మీకు ఇస్తామని చెబుతున్నారు. ఇలా ముందుగానే డబ్బులు చెల్లించి మెమోలు, ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి కళాశాలలకు సొమ్ము జమచేయక పోవడంతో విద్యార్థులకు కూడా యాజమాన్యాలు చెల్లించడంలేదు.

రూ.125 కోట్లపైనే...

జిల్లాలో ఇంజనీరింగ్, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, లా, డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐతోపాటు సాంకేతిక చదువులు చదువుతున్న వారికి రూ.100కోట్లపైనే బకాయిలు రావాలి. ఇందులో భద్రాచలం ఐటీడీఏ ద్వారా గిరిజన విద్యార్థులకు 2021-22లో రూ.4.50కోట్లు, 2022-23లో రూ.16.69 కోట్లు, 2023-24లో రూ.21.88 కోట్లు, ఈ ఆర్థికసంవత్సరంలో రూ.7.24కోట్లు రావాల్సి ఉంది. సుమారు రూ.50 కోట్లపైగా భద్రాచలం ఐటీడీఏ గిరిజనసంక్షేమశాఖ స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం నుంచి చెల్లించాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు రూ.8.39కోట్లు బకాయిలుండగా మైనారిటీ విద్యార్థులకు రూ.1.41 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ జిల్లాలో బీసీ విద్యార్థులకు కూడా సుమారు రూ.10 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఖమ్మంజిల్లా పరిధిలో బీసీ విద్యార్థులకు సుమారు రూ.30 కోట్లు, ఈబీసీ విద్యార్థులకు రూ.1.42కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉంది. మైనారిటీ సంక్షేమశాఖ సుమారు రూ.5 కోట్లు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు 2022-23లో రూ.5.60 కోట్లు, 2023-24లో రూ.9.70కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు మెస్ చార్జీలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎస్టీ విద్యార్థులకు సుమారు రూ.2కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఫీజు బకాయిలు, మెస్‌చార్జీలు పెద్దఎత్తున పేరుకు పోయాయి.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

- ప్రముఖ సినీ నటుడు సుమన్
- భద్రాద్రి రామాలయంలో ప్రత్యేక పూజలు


విద్యార్థులతో సుమన్

భద్రాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో విద్యార్థులు చదువుల్లో రాణించి లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. భద్రాచలంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తన మిత్రుడైన ప్రవాస భారతీయుడు నన్నపనేని మోహన్ నిర్మించగా దానిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుమన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల పట్ల ఏకాగ్రత వహించి అత్యుత్తమ ఫలితాలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రవాస భారతీయులు నన్నపనేని మోహన్ భద్రాచలంలో విద్యార్థులకు పాఠశాల భవనాలను నిర్మించి ఇవ్వడం ముదావాహమన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాల ఎంతోమందికి ఉపయోగపడుతుండటం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని సుమన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో సీఐ స్వామి, దేవస్థానం పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, వైదిక పరిపాలన సిబ్బంది నన్నపనేని మోహన్ పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

- సాయిబాబా మరణం ప్రభుత్వ హత్యే
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ముదిగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కులాల మధ్య చిచ్చుపెట్టి మత విద్వేషాలను బీజేపీ రెచ్చగొడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ముదిగొండ మండలం అమ్మపేటలో శుక్రవారం సీపీఎం మండల మహాసభ బట్టు పురుషోత్తం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కేంద్రంలో ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం పదివేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. సంక్షేమ రాజ్యంలో సంక్షేమం లేదని, రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. దేశంలో దుర్మార్గపు పాలన కొనసాగుతుందని, మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోయాయని విమర్శించారు. కమ్యూనిస్టు ఐక్యఫ్రంట్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజల్లో చైతన్యం ప్రారంభమైందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణం సహజమైంది కాదని అది ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. కమ్యూనిస్టు కార్యకర్తలు విప్లవ ఉద్యమాల్లో భాగమై పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పబ్బం గడుపుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, చింతల చెర్వు కోటేశ్వరరావు, వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ, వెంకన్న, దామోదర్, నాగేశ్వరరావు, భద్రయ్య రవికుమార్, ఉపేందర్ పాల్గొన్నారు. కాగా, ఈ సభలో సీపీఎం ముదిగొండ మండల కార్యదర్శిగా రెండోసారి బట్టు పురుషోత్తం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డిఎంఎఫ్‌టి నిధుల పక్కదారి

- నిబంధనలకు విరుద్ధంగా ఇతర పనులకు కేటాయింపులు
- రూ. 750 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలు
- పీఏం కేకేకేపై అధికారే కీలక సూత్రధారి..?
- మైనింగ్ ప్రభావిత ప్రాంతాలకు అన్యాయం
- నేడు భద్రాద్రి జిల్లా 'దిశ' సమావేశంలో చర్చ

7

ఆ పనులకు బాధ్యులు ఎవరు?

- బడ్జెట్ కేటాయింపు, ఫైనాన్స్ అనుమతి లేదు..
- గత ప్రభుత్వంలో మంత్రుల వత్తిడి మేరకు అభివృద్ధి పనులు
- కేఎంసీలో రూ.60 కోట్ల బిల్లుల పెండింగ్
- మేయర్ నీరజను కలిసిన కాంట్రాక్టర్లు
- బిల్లులు ఇవ్వకుంటే సమ్మె చేస్తామని సంకేతం

7

బీటెక్ బాబు హైటెక్ సాగు

- 'డ్రాగన్ ఫ్రూట్' పంటతో లాభాల బాట
- ఆదర్శంగా నిలుస్తున్న యువ ఇంజనీర్

6

ఎరువుల 'ధర'వు

రెండు రకాల ఎరువులు రూ.100చొప్పున పెంపు

వైరా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు విరివిగా వాడే రెండురకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలను కంపెనీలు పెంచాయి. ఆ మేరకు కంపెనీల ప్రతినిధులు రిటైల్ ఎరువుల వ్యాపారులకు సమాచారమిచ్చారు. రైతులు ఎంతో ఇష్టంగా వాడే 20-20-0-13 రకం, 14-35-14 రకాలకు చెందిన కాంప్లెక్స్ ఎరువులు బస్తా ఒక్కంటికి రూ.వంద చొప్పున పెంచినట్లుగా సంబంధిత ఎరువుల కంపెనీల ప్రతినిధులు రిటైల్ డీలర్లకు సమాచారం అందించారు. పెరిగిన ధరలకు సంబంధించిన ఎరువులను సోమవారం నుంచి సరఫరా చేయనున్నట్లు స్పష్టం చేశారు. డీఏపీ, 28-28-0, 10-26-26, 12-32-16, 16-16-16, పొటాష్ ధరలు పెరగనప్పటికీ రిటైల్ డీలర్లకు ఇచ్చే కమీషన్లలో కోత విధించారు. ఈ రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే జొన్న, వరి, చెరకు పంటలకు ఎక్కువగా ఎరువులు వాడే తరుణంలో ఆయా కంపెనీలు ధరలు పెంచటంతో రైతులపై కోట్లాది రూపాయల భారం పడనుంది. ఎరువుల ధరలు ఇలా ఉన్నాయి.



ఎరువు పేరు	పాత ధర	పెరిగిన ధర
20-20-0-13	రూ.1200	రూ.1300
14-35-14	రూ.1700	రూ.1800

హోటల్ యజమాని దివాలా

- కోర్టులో 2.75 కోట్లకు ఐపీ దాఖలు
- బోనకల్‌లో కలకలం

బోనకల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌కు చెందిన హోటల్ యజమాని రామన నర్సింహారావు, తన భార్యతో కలిసి రూ.2.75 కోట్లకు ఐపీ దాఖలు చేశారు. ఈ మేరకు ఖమ్మం సివిల్ జడ్జి కోర్టు నుంచి రుణదాతలకు శుక్రవారం నోటీసులందాయి. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన నర్సింహారావు కొన్ని సంవత్సరాలుగా బోనకల్‌లో స్థిరపడి హోటల్ నిర్వహిస్తున్నారు. బ్యాంకు ద్వారా లోన్ తీసుకొని ఇల్లు కట్టుకున్నాడు. గ్రామంలో పలువురు వ్యక్తులు, వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నాడు. అయితే అవి తీర్చే పరిస్థితి లేకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. నర్సింహారావు పేరుతో రుణదాతలు 73 మంది, భార్య పేరుతో 11 మందిని చూపించారు. నర్సింహారావు పేరు మీద ఉన్న ఆస్తి విలువ రూ.1.40కోట్లు, భార్య పేరిట రూ.72 లక్షల విలువ చేసే ఇల్లును ప్రాపర్టీలో చూయించారు. రుణదాతలందరూ ఈ నెల 25న కోర్టుకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.

లబోదిబోమంటున్న రుణదాతలు

కడుపు కట్టుకుని దాచిన కొద్దిపాటి సొమ్మును నమ్మకంతో ఇచ్చారు. ఇప్పుడవి రావని తెలిసిన రుణదాతలు లబోదిబోమంటున్నారు. ఐపీ దాఖలు చేసిన హోటల్ యజమాని నర్సింహారావు దగ్గర కూలిపనులు చేసే ఆవుల గురవమ్మ నాంతాడు, బంగారు గొలుసు తాకట్టు పెట్టి డబ్బు ఇచ్చింది. ఐపీలో ఆమెను కూడా ప్రతివాదిగా చేర్చి అప్పు కింద రూ.1.20 లక్షలు చూపించారు. ఇక కూలి పనులు చేసే బోడ శేషమ్మ రూ. 50వేలు, నూతలపాటి కోటయ్య 50వేలు, రాయనపేటకు చెందిన గమ్మడెల్లి యశోద లక్ష రూపాయలు ఇచ్చారు. వీరితో పాటు చిన్నాచితక పనులు చేసే ఇంకొందరి వద్ద నుంచి కూడా నర్సింహారావు అప్పు తీసుకున్నారు.

స్ఫూర్తి

ఏరువాకా సాగారో అన్నో చిన్నన్నా... నీ కష్టమంతా తెలుసునురో అన్నో చిన్నన్నా... అంటూ పల్లె పదాలను వల్లెవేస్తూ పొలం పనుల్లో నిమగ్నమైతే ఆ అనుభూతే అద్భుతంగా ఉంటుంది. సరిగ్గా ఈ మట్టి వాసన నచ్చి బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన కుర్రాడు పొలం బాటపట్టాడు. ఎక్కడో పని చేయటం కంటే సొంత ఐడియాలతో ఆధునిక పద్దతులతో వ్యవసాయం చేస్తే ఉద్యోగం కంటే ఎక్కువగా సంపాదించవచ్చని నిరూపిస్తున్నాడు. కొణిజర్ల మండలం ఉప్పలచలక అనే మారుమూల గ్రామంలో గుగులోతు సోమాధరియాసింగ్


తోటలో యువ ఇంజనీర్ సోమాధరియాసింగ్

బీటెక్ బాబు.. హైటెక్ సాగు

'డ్రాగన్ ఫ్రూట్' వ్యవసాయంతో లాభాల బాట

- లక్షల వేతనం వదిలి పొలం పనులకు...
- ఉద్యానశాఖ నుంచి సలహాలు..
- కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీలు
- ఆదర్శంగా నిలుస్తున్న యువ ఇంజనీర్

కొణిజర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాజారాం, వీరమ్మ దంపతులకు నలుగురు సంతానం. వారిలో చిన్నవాడు గుగులోతు సోమాధరియా సింగ్. హైదరాబాద్ సీవీఆర్ కళాశాలలో బీటెక్‌లో మెకానికల్ ఇంజనీర్ పూర్తి చేశాడు. 2019లో తను బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నంలో బెంగుళూర్‌లో ఎల్అండ్‌టీ కంపెనీలో క్యాట్ కమ్ డిజైనింగ్ ఉద్యోగాన్ని సాధించాడు. ఏడాదికి రూ. 3.50 లక్షలు వేతనం. ఆరు నెలలు ఉద్యోగం చేసి వ్యవసాయం ఎందుకు చేయకూడదని ఆలోచించాడు.


డ్రాగన్‌ఫ్రూట్ సాగు

ఉద్యోగాన్ని వదులుకొని..

ఉద్యోగం వచ్చిన ఆరునెలలకే సోమాధరియా సింగ్ తను చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాడు. చదివింది మెకానికల్ ఇంజనీరింగ్ అయినప్పటికి ఆధునిక వ్యవసాయం చేయాలని పట్టుదల పెంచుకున్నాడు. తండ్రితో సంప్రదించి ఇంటికి వచ్చాడు. అదే సంవత్సరంలోనే డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఒక్క అడుగు ముందుకు వేసి

డ్రాగన్ ఫ్రూట్ గురించి క్షుణ్ణంగా తెలుసుకున్న సోమధరియాసింగ్ అరకు నుంచి ఒక్కొక్క డ్రాగన్ ఫ్రూట్ అంటును రూ.80 చొప్పున తమకున్న భూమిలోని ఎకరం పదికుంటలకు సరిపోయే మొక్కలను కొనుగోలు చేసి తెప్పించాడు. మొదటి సంవత్సరం మొక్కవేసిన దగ్గర నుంచి మొదటి కాపు వచ్చే వరకు మొత్తం రూ. 7.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. రెండో సంవత్సరం నుంచి కాపు వచ్చింది. రెండవ సంవత్సరం రెండు లక్షలు రాగా, మూడవ సంవత్సరం నాలుగు లక్షలు, 4వ సంవత్సరం ఎనిమిది లక్షలు పంట ద్వారా సాధించాడు. ప్రస్తుతం మరో కాపు సిద్ధంగా ఉంది.

తన తండ్రికి ఉన్న 12 ఎకరాల భూమిలో సింగ్ పత్తి, మిర్చి పంటలను సాగు చేస్తున్నాడు. ఎకరం పదికుంటల భూమిలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేయగా మరో ఎకరంలో మస్రూమ్ సాగుకు సిద్ధం చేస్తున్నాడు. తండ్రికి సహకరిస్తూనే డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నాడు. తను పండించిన పంట మార్కెట్‌దాక వెళ్ళక ముందే గ్రామాలలో ప్రజలు కేజీ రూ. 150 లు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు యువరైతు తెలిపాడు.

సర్కారు నుంచి సబ్సిడీ పొందుతూ:

సోమధరియాసింగ్ తనకున్న తెలివితేటలతో కేంద్ర ప్రభుత్వం నుంచి సాగు చేసిన ఎకరం పదికుంటల్లో అరెకరానికి గత సంవత్సరం నుంచి రూ. 2.50 లక్షలు సబ్సిడీ పొందుతున్నాడు. అంతేకాకుండ ఈ ఏడాది నుంచి ఖమ్మం ఉద్యానవనశాఖ నుంచి కూడా సలహాలు సూచనలు తీసుకుంటున్నట్లు యువ ఇంజనీర్ తెలిపారు. సోమాధరియాసింగ్ డ్రాగన్‌ఫ్రూట్ సాగులో లాభాలు రావడంతో మస్రూమ్, బ్లాకటమాటా సాగు వైపు దృష్టి పెట్టాడు. ఈ రెండు పంటల సాగును చేపడుతున్నట్లు అందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నట్లు తను తెలిపాడు.

వ్యవసాయాన్ని చిన్నచూపు చూడొద్దు సోమాధరియాసింగ్ మెకానికల్ ఇంజనీర్

ఎవరైన వ్యవసాయాన్ని చిన్నచూపు చూడొద్దు. మనిషి తలుసుకుంటే వ్యవసాయంలో ఉన్న మెలుకువలను తెలుసుకొని ఆధునిక రంగంవైపు అడుగులు వేయవచ్చు. మెకానికల్ ఇంజనీర్ చేసిన తను ఎందుకు వ్యవసాయం చూయకూడదని అనుకున్నా. వెంటనే ఇంటికి వచ్చిన తను మా నాన్నను సంప్రదించి డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టా. ఉద్యోగం కంటే అధికంగా సంపాదిస్తున్నా. ఎంతో సంతృప్తిగా ఉంది. యువత మొత్తం అర్థం చేసుకొని వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయటానికి కృషి చేయాలి. ఎక్కడో పని చేసే దానికంటే సొంతభూమిలో వ్యవసాయం చేసుకుంటే ఆ సంతృప్తి వేరు. నలుగురుని ప్రోత్సహించటానికి తను చేపట్టిన డ్రాగన్‌ఫ్రూట్ సాగు ఆదర్శంగా నిలుస్తుంది. అన్నం పెట్టే రైతును అందరూ ఆదరించాలి.

ఆధునిక నైపుణ్య కేంద్రాల్లో

సీట్ల భర్తీకి చర్యలు చేపట్టాలి

రాష్ట్ర కార్మికశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్ కుమార్


వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానుగుణంగా ప్రస్తుత ఉద్యోగ అవసరాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా (అడ్వాన్డ్ టెక్నాలజీ సెంటర్స్) తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిలో భాగంగానే ఐటీఐల్లో కొత్త ట్రేడ్లు అందుబాటులోకి తెస్తున్నట్లు, వీటిలో సీట్ల భర్తీకి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర కార్మికశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కార్మికశాఖ ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీట్ల భర్తీపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. ప్రస్తుత ప్రపంచంలో పోటీకి నిలబడి, ఉపాధి పొందాలంటే నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. యువతలో అవగాహన కల్పించి, ట్రేడ్లపై, ట్రేడ్ల ద్వారా కలిగే ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం కల్పించి, సీట్ల భర్తీకి కార్యాచరణ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కార్మిక సహాయ కమిషనర్ కృష్ణవేణి, సహాయ కార్మిక అధికారులు వెంగమ్మ, రమేష్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కూరగాయలు కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	60
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	44
కాకరకాయ	44
బెండకాయ	36
పొట్లకాయ	60
దోసకాయ	56-60
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	34
దొండ	28-38
సొరకాయ	36
క్యారెట్	64
క్యాప్సికం	88
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎర్రుపాలెం కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీచేసిన జీసీడీవో

ఎర్రుపాలెం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శిశుసంక్షేమశాఖ బాలబాలికల అభివృద్ధి అధికారి తులసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలో బాలికల మూత్రశాల, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతుల పనులు పరిశీలించారు. పనుల జాప్యంపై ఆరాతీశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించడంతో పాటు నిర్ణీత సమయానికి ప్రతిపాదించిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వారంరోజుల్లో పనులన్నీ పూర్తిచేయాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందుతుందో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను నెలరోజుల్లోగా భర్తీ చేస్తామన్నారు. పాఠశాల్లో అకౌంటెంట్, వంటమనిషి, సిబ్బంది పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని త్వరలో అవి కూడా భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.సరిత, అధ్యాపకులు రేఖ, సులోచన, జయంతి, అనిత, పద్మ, రమాదేవి, దేవిప్రియ, ఉమ, నాగమణి,స్వప్న, యశోద, అరుణ పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్ సస్పెన్షన్‌పై కేఎంసీలో తీవ్ర చర్చ

- విచారణ నిర్వహించకుండానే తిరిగి విధులకు ప్రయత్నం
- మేయర్ పునుకొల్లు నీరజ అంగీకరించకపోవటంతో నిలిచిన దస్త్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పక్క డివిజన్‌లో ప్రత్యేక సర్వేకు వెళ్లి అడ్డగోలుగా బిల్ కలెక్టర్ ఓ భవన యజమాని వద్ద డబ్బులు డిమాండ్ చేయటంతో వాట్సాప్ ఆధారాలతో కేఎంసీ అధికారులు బిల్ కలెక్టర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. తర్వాత ఇంజనీరింగ్ డీఈ మాధవిని విచారణ అధికారిగా నియమించారు. రెండు వారాల గడువు కూడా విచారణకు ఇచ్చారు. అయితే ఇంత వరకు బాగానే ఉంది. కానీ బిల్ కలెక్టర్‌పై కనీసం విచారణ జరగకుండానే సస్పెన్షన్ చేసిన అధికారులే తిరిగి బిల్ కలెక్టర్‌కు ఉద్యోగంలోకి రమ్మనేందుకు దస్త్రం తయారు చేసే సమయంలో విషయం బయటకు పొక్కింది. దీంతో బిల్ కలెక్టర్‌పై ఆధారాలతో ఫిర్యాదులు చేసిన వారితో పాటుగా కార్పొరేటర్ అధికారుల తీరును ఖండించారు. విషయం తెలుసుకున్న మేయర్ పునుకొల్లు నీరజ స్పందించారు. పారదర్శకంగా విచారణ చేసిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ సంఘటన శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఆరు గ్యారంటీలను విస్మరించేందుకే తెర పైకి హైడ్రా

జడ్పీ మాజీ చైర్మన్ కమలరాజ్



బోనకల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను విస్మరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం తెర పైకి హైడ్రాను తీసుకొచ్చిందని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజు ఆరోపించారు. బోనకల్‌లో శుక్రవారం మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయకుండా నిబంధనల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. మంత్రులు రుణమాఫీ అంశంపై తలోమాట చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుబంధు పథకాన్ని రూ.15వేలకు పెంచి ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడం సబబు కాదన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి ఆచరణలో అవి చేయలేక తంటాలు పడుతున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోదుగుల నాగేశ్వరావు, వేమూరి ప్రసాద్, కొనకంచి నాగరాజు, పారా ప్రసాద్, కొమ్మినేని ఉపేందర్, బుడావత్ సైదా తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2,3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మొత్తం 87 పరీక్ష కేంద్రాలు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీఎస్‌పీఎస్‌సి గ్రూప్-2,3 పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి గ్రూప్ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన మౌళిక వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలన్నారు. పరీక్షా కేంద్రాల ధృవీకరణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ల ముద్రణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గ్రూప్ పరీక్షల నిర్వహణకు మొత్తం 87 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, 68 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు వివరించారు. పరీక్షకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నవంబర్ 17 ఉదయం, మధ్యాహ్నం, నవంబర్ 18న ఉదయం గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పక్కాగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 28 వేల 468 అభ్యర్థులు గ్రూప్ 3 పరీక్షలకు హాజరవుతారని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ నోడల్ అధికారిగా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయ ఇంజనీరింగ్ కాలేజ్, ఖమ్మం ప్రిన్సిపాల్, ఎస్.బి.ఐ.టి ఇంజనీరింగ్ కాలేజ్ ఖమ్మం ప్రిన్సిపాల్ లను రీజనల్ కోఆర్డినేటర్లుగా నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో రాజేశ్వరి, ఏసీపీ రమణ మూర్తి, ఏటివో విజయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన దండకారణ్యం


హాజరైన వివిధ గ్రామాల ప్రజలు


అమరులకు నివాళులర్పిస్తున్న మావోయిస్టులు

- ఘనంగా మావోయిస్టు పార్టీ 20వ ఆవిర్భావ వేడుకలు
- సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్న వీడియోలు

చర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ సెప్టెంబరు 4వ తేదీ నుంచి నెల రోజుల పాటు 20వ ఆవిర్భావ వేడుకలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాగా దండకారణ్యంలో ఒకవైపు ఎన్‌కౌంటర్లు జరుగుతుండగా మరో వైపు మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకలు అడవుల్లో ఘనంగా జరుపుకొన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఆరు నిమిషాల ఓ వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోని మావోయిస్టులు తాజాగా తీసి, విడుదల చేసినట్లు తెలుస్తోంది. మావోయిస్టులు ఓ స్థూపం కట్టి దాని చుట్టూ పాటలు పాడుతున్నట్లు అందులో కనిపిస్తోంది. అమరులకు జోహార్లు అంటూ మావోయిస్టులు నినాదాలు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు సంతాపం తెలిపారు. వందల మంది మావోయిస్టులు అడవిలో ర్యాలీగా వెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వివిధ గ్రామాల ప్రజలు మావోయిస్టుల పాటలు, నినాదాలను చూర్సోని చూస్తున్నారు. వీడియోలో అమరులకు జోహార్లు అంటూ తెలుగు పాటు కూడా విన్పిపిస్తున్నాయి. కాగా దండకారణ్యంలోనే మావోయిస్టులు మావోయిస్టు పార్టీ 20వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించి, ఈ రోడు ఆ వీడియోలు విడుదల చేసినట్లు తెలుస్తోంది. కాగా ఒకవైపు భారీగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్నా మావోయిస్టు పార్టీ వేడుకలు నిర్వహించడం, వందల మంది మావోయిస్టులు తుపాకులు పట్టుకుని ర్యాలీలు నిర్వహించడం విశేషం. కాగా చెక్కర్లు కొడుతున్న వీడియోపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. మావోయిస్టులు ఏ ప్రాతంలో ఈ వేడుకలు జరుపుకొన్నారనే అశంపై ఆరా తీస్తున్నారు.

విద్యార్థులలో శాస్త్రీయ జ్ఞానం పెంచాలి

- చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించడం, సమాజంలో మార్పు తీసుకురావటానికి విద్యార్థులలో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించ డంలో ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర పోషించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం డీఎస్సీ-24 ద్వారా నూతనంగా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులను ఉద్దేశించి నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన ముఖాముఖి కార్యక్రమం అనంతరం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. పిల్లల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ అందరు విద్యార్థులు రాసే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా బాధ్యులు నాగేశ్వరరావు, మోహన్, రామారావు, శివ నారాయణ, రాఘవయ్య, ఎల్విరెడ్డి, డాన్ బొస్కో, లింగమూర్తి, విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 మెయిన్స్‌ను వాయిదా వేయాలి


ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెంబర్ 55తో పునరుద్ధరించి గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించాలని శుక్రవారం నగరంలోని జిల్లా గ్రంథాలయం వద్ద గ్రూప్ 1 అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. కోర్టు పరిధిలో కేసులు ఉన్నందున్న పరీక్షలను వాయిదా వేసి కోర్టు తీర్పు అనంతరం పరీక్షలు నిర్వహించాలని నినాదాలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బాలసాని నివాసానికి వెళ్లి వినతిపత్రం అందించి న్యాయం జరిగేవిందంగా చూడాలని కోరారు. వెంటనే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని అభ్యర్థులు తెలిపారు.

ఇందిర మహిళ డెయిరీ ప్రాజెక్టును

ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా డెయిరీ ప్రాజెక్టును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరా డైరీపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మధిర అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందిరా మహిళా డెయిరీ, ఎర్రుపాలెం మండల మహిళా సమాఖ్య గ్రామంలో పాలు సేకరించి విజయ డెయిరీకి తరలిస్తున్నట్లు చెప్పారు.

మధిర నియోజకవర్గం పరిధిలో పాల ఉత్పత్తి పెంచే దిశగా గేదె, గడ్డి షెడ్డు ఉన్న పాడి రైతులకు పాడి పశువులు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబరు లోపు పాడి రైతులకు పశువులు పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలని, పాల ఉత్పత్తిని అంచనా వేస్తూ దానికి తగిన విధంగా పాలసేకరణ కేంద్రాలు, ఇతర సదుపాయాల కల్పనకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విజయా డెయిరీ గవర్నింగ్ బాడీ పనితీరును పరిశీలించి, ఇందిరా మహిళా డెయిరీ గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. వేణుమనోహర్, అడిషనల్ డీఆర్డీవో. మొహమ్మద్ నూరుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తిని 13 గొర్రెల మృత్యువాత

మణుగూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని రాజుపేట మల్లంపాడు చెరువు ప్రాంతంలో ఉన్న బ్లాస్టింగ్ స్టోరేజీ వద్ద 13 గొర్రెలు వ్యర్థాలను తిని మృత్యువాత పడ్డాయి. శుక్రవారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. రాజుపేట గ్రామానికి చెందిన గంగరాజుకు చెందిన ఎనిమిది మేకలు, మల్లయ్యకు చెందిన ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం యథావిధిగా సమీపంలో అటవీ ప్రాంతంలో కాపరి ద్వారా మేతకు వెల్లిన ఈ గొర్రెలు, బ్లాస్టింగ్ కు చెందిన వ్యర్థాలను తిని ఇంటికి చేరుకున్నాయి. రాత్రిగొర్రెలను పరిశీలించే సరికి అవి నోటి నుంచి నురుగు కక్కుతూ మృతి చెందాయని యజమానులు తెలిపారు. బ్లాస్టింగ్ సామగ్రిని తెచ్చే వ్యాను మ్యాగ్జిన్‌లో వాటిని భద్రపరిచి వ్యాన్‌లోని వ్యర్థ కవర్లను బయటపడేస్తారు. ఇలానే శుక్రవారం మేతకు ఈ ప్రాంతానికి చేరుకున్న గొర్రెలు ఆ కవర్లను అందులోని వ్యర్థలను తిని ఉండటం వల్ల మృతిచెందాయని బాధితులు పేర్కొంటున్నారు. జరిగిన ఘటనపై సంబంధిత అధికారులు తగిన చర్యలను తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు గంగరాజు, మల్లయ్య కోరుతున్నారు.

సత్తాచాటిన పేదింటి దివ్వెలు...

- కష్టపడి చదివి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా...
- తల్లిదండ్రులు కూలీలు, బిడ్డలు సర్కారు టీచర్లు

2024 డీఎస్సీలో ఖమ్మం జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో ఎక్కువ మంది గ్రామీణ నేపథ్యం ఉన్న పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. కొందరు తల్లిదండ్రులు కూలీ పనులు, కొందరు పూర్తిగా వ్యవసాయం చేసేవారే. వారి పిల్లలు వారిలా కష్టాలు పడొద్దనే లక్ష్యంతో వారి కష్టాన్ని మొత్తం పిల్లల చదువులకే కేటాయించారు.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురంహవేలి

కూలి పనులు చేసుకుంటూ చదివించారు

జంగం జ్యోతి శిరీష, మిట్టపల్లి



నా తల్లిదండ్రులు కూలి పనులు చేస్తు చదివించారు. 2024 డీఎస్సీలో 43వ ర్యాంక్ సాధించి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యా. నా తల్లిదండ్రులు పడ్డ శ్రమ ఫలితంగానే ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యాను. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామం, మా నాన్న పవన్ సుతారి పనులు చేస్తుంటారు. అమ్మ శారమ్మ గ్రామంలో రైతువారి కూలి పనులకు వెళుతుంది. మొదటి నుంచి మాది పేదకుటుంబం. పనులకు వెళ్తేనే కుటుంబం గడిసేది. అలాంటి పరిస్థితుల్లో నన్ను చదివించటం తోపాటు నాచెల్లి స్పందనను అదృష్టంగా భావిస్తున్నా.

కుటుంబ సభ్యుల తోడ్పాటుతోనే ఉద్యోగం

చిట్టమోదు ధనలక్ష్మి, మోటమర్రి



నా తల్లితండ్రులు, నా భర్త సహకారంతోనే నేను ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించా. 2024 డీఎస్సీలో 29వ ర్యాంక్‌తో ఎస్‌జీటీగా ఎంపికయ్యా. ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల్లో ఎస్‌జీటీగా ఉద్యోగంలో చేరాను. బోనకల్ మండలం మోటమర్రి గ్రామం. అమ్మా, నాన్న పాపాయ్య, రమాదేవి వ్యవసాయం చేసర్తూ నన్ను చదివించారు. నాభర్త ఖమ్మం నగరంలో ప్రవేటు ట్యూషన్లు చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నాం. కుటుంబ సభ్యుల సహకారంలో డీఎస్సీ రాసి ఉద్యోగం సాధించాను.

అమ్మ కృషి వల్లే జాబ్ వచ్చింది

బాల. నరసింహారావు, ముదిగొండ



నా తల్లి లక్ష్మీకాంతం కృషి వల్లనే నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. 2024 డీఎస్సీలో 15వ ర్యాంక్‌తో స్కూల్ అసిస్టెంట్ గణితం ఉపాధ్యాయుడిగా ఎంపియ్యాను. ముదిగొండ మండలం యడవల్లి పాఠశాలలో చేరాను. తండ్రి హుస్సేన్ చిన్నతనంలో మృతి చెందారు. నా తల్లి కూలీ పనులు చేస్తూ నన్ను చదివించింది. కుటుంబ అవసరాల రోజురోజుకు పెరగటంతో నేను ముదిగొండలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తు చదవాను. అమ్మ పడ్డ కష్టానికి నేడు ఫలితం నేడు నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికకావటమే.

తల్లిదండ్రులు, భర్త సహకారంతో..

గంగుల ఉషాశ్రీ, పల్లిపాడు



నా తల్లిదండులు, భర్త సహకారంతోనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించా. 2024 డీఎస్సీలో 141వ ర్యాంక్ సాధించి ఎస్‌జీటీగా ఎంపికయ్యా.. బోనకల్ మండలం మోటమర్రి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో చేరాను. తల్లి ఆదిలక్ష్మి, తండ్రి సీతా రాములు వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. వివాహం అనంతరం నా భర్త సైదేశ్వరరావు సహకారంతో పోటీ పరీక్షలకు సిద్ధమైనాను. ఆర్థిక సమస్యలను అధికమించి నా కోరిక నేరవేర్చుకున్నా..

కష్టాలను అధిగమించి..

గోదా వరలక్ష్మి, పెనుబల్లి (దివ్యాంగురాలు)



చిన్నతనం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదల ఉండేది. చిన్న తనం నుంచే దివ్యాంగురాలిని. 2024 డీఎస్సీలో 209వ ర్యాంక్ సాధించి ఎస్‌జీటీగా ఎంపికైనా. పెనుబల్లి మండలం గంగదేవిపాడు పాఠశాలలో చేరాను. తల్లిదండ్రులు నాగేశ్వరరావు, పద్మలు వ్యవసాయ కూలీలుగా పని చేస్తు నన్ను చదివించారు. పేద కుటుంబం కావటంతో ఆరిథక ఇబ్బందులు తప్పలేదు. అన్నింటిని అధికమించి తల్లితండ్రులు సహకారంతో అనుకున్న ప్రభుత్వం ఉద్యోగం సాధించాను.

భర్త సహకారంతో అనుకున్నది సాధించా

సంతంగా చెన్నమ్మ, సూర్యబంజర



నా భర్త కృష్ణయ్య సహకారంతోను ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యాను. 2024 డీఎస్సీలో 253వ ర్యాంక్‌తో ఎస్‌జీటీగా ఎంపికై పెనుబల్లి మండలం గొల్లగుడెం పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా చేరాను. నా భర్త ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ నన్ను పోటీ పరీక్షలకు సిద్ధం చేశాడు. తల్లి లక్ష్మీ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ నన్ను చదవించింది. వారి సహకారం లేకపోతే నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించేదాన్ని కాను.

నేడు పూజా సామగ్రి వేలం

ఏన్కూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం గార్లోడ్డు శ్రీ లక్ష్మినర్సింహాస్వామి ఆలయ పూజాసామగ్రి వేలంపాట ఈనెల 19న శనివారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎస్‌వీడీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజాసామగ్రి, కొబ్బరికాయలు, పాలు, బెల్లం, బియ్యం, కొబ్బరిచిప్పలు పోగుచేసుకోవడానికి వేలం పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నారు. రెండేళ్లకు జరిగే వేలంపాటలో ఆసక్తికలిగిన వారు డిపాజిట్ డీడీ తీసి పాల్గొనాలని ఈవో కోరారు.

క్షేత్రస్థాయి అధ్యయనానికి..

- 21 మంది ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఆఫీసర్స్ రాక

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల మంత్రిత్వశాఖ (ఎంసీఆర్ హెచ్ఆర్డీ) ఆధ్వర్యంలో 21 మంది అలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన కోసం ఖమ్మం జిల్లాకు రానున్నారు. మొత్తం 21 మంది బృందం సభ్యులు ఈనెల 21 నుంచి 28 వరకు మొదటి విడతగా జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో వారు బస చేసి అధ్యయనం చేయనున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో సామాజిక ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, గ్రామీణ ప్రజలు బీపీఎల్ కుటుంబాలు, భూమి లేని కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇబ్బందలు, రాజకీయ, సామాజిక కార్యకలాపాల్లో మహిళల పాత్ర , జీవన నాణ్యత, అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుతీరు, వాటి ప్రభావంతో గ్రామాల్లో కలిగిన మార్పులు తదితర అంశాలను ఈ బృందం అధ్యయనం చేయనున్నారు. 21 మంది అధికారుల్లో ఆరుగురు మహిళా అధికారులుల కాగా వీరిలో ఇద్దరు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. వీరంతా ఏప గ్రామాల్లో పర్యటించడానికి కావాల్సి ఏర్పాట్లను జడ్పీ సీఈవో రైనా దీక్ష నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సమన్వయ కర్తగా ఉండనున్నారు. వీరి రాక కోసం ఎంసీఆర్డీ హెచ్ఆర్డీ జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నివాస ప్రాంతాల్లో బాణాసంచా అక్రమ నిల్వలు లేకుండా చూడాలి

- అడిషనల్ డీసీపీ(లాఅండ్ ఆర్డర్) ప్రసాదరావు



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ప్రసాదరావు

వేంసూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంసూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం అడిషనల్ డీసీపీ లాఅండ్ ఆర్డర్ ప్రసాదరావు సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న దీపావళి పండుగ దృష్ట్యా నివాస ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో టపాసులు అక్రమంగా నిల్వ లేకుండా చూడాలని ఎస్‌హెచ్‌వో, సెక్టార్ ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. 5ఎస్ అమలులో భాగంగా పోలీస్‌స్టేషన్లలో స్టేషనరీ విభాగాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన రికార్డులు, వస్తువులను క్రమపద్ధతిలో ఉంచాలని సూచించారు. స్టేషన్ పరిసరాల్లో సురక్షితమైన ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసుకోవాలన్నారు. పెట్రోకారు, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారని, పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

ఆ పనులకు బాధ్యులు ఎవరు?

- బడ్జెట్ కేటాయింపు, ఫైనాన్స్ అనుమతి లేదు..
- గత ప్రభుత్వంలో మంత్రుల వత్తిడి మేరకు అభివృద్ధి పనులు
- నగర పాలక సంస్థ పరిధిలో చేసిన పనులకు రూ.60 కోట్ల బిల్లుల పెండింగ్
- మేయర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు
- బిల్లులు ఇవ్వకుంటే సమ్మె చేస్తామని సంకేతం

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో నోటిపికేషన్‌కు ముందు ప్రభుత్వం నుంచి వెలువడే ఆదేశాలు ఇప్పుడు అధికారులకు తలనొప్పిని, పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెడ్తున్నాయి. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఇవ్వటం లేదని ఖమ్మం నగర పాలక సంస్థ కాంట్రాక్టర్లు సమ్మె చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

రూ.60 కోట్ల పెండింగ్ బకాయిలు

అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు కొద్ది రోజులు ముందు కేఎంసీలోని 60 డివిజన్లకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.60 కోట్లు నిధులు ప్రకటించింది. బడ్జెట్ కేటాయింపు లేదు. ఫైనాన్స్ అప్రూవల్ కాలేదు. మంత్రుల ఆదేశాల మేరకు ఆనాటి అధికారులు వత్తిడి చేసి మరి కాంట్రాక్టర్లతో రూ.23 కోట్లు పనులు చేయించారు. తర్వాత ప్రభుత్వం మారింది. దీంతో రూ.23 కోట్ల పనుల బిల్లుల సంగతి మూలకు చేరింది. అయితే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్‌డీఎఫ్ నిధులపై చర్చ కాగా పనులు జరిగిన వాటికి నిధులు ఇస్తామనే సంకేతాలు వెలువడ్డాయి.

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో సేకరించే ట్యాక్స్‌లు ఇతర ఆదాయాలు జనరల్ ఫండ్ నిధుల కిందకు జమ జరుగుతాయి. జనరల్ ఫండ్ అనేది ఖమ్మం నగర పాలక సంస్థ బ్యాంకు ఖాతాలకు జమ కావాల్సి ఉంటుంది. కానీ గత ప్రభుత్వంలో జనరల్ ఫండ్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వ ఖజాన(ట్రెజరీ)ఖాతాలకు మార్పులు చేశారు. దీంతో కేఎంసీలో జరిగిన రూ.25 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాలేదు. జనరల్ ఫండ్ నిధుల చెక్కులు డ్రా జరగాలంటే హైదరాబాద్ స్థాయిలోనే 10శాతం కమిషన్ ఇవ్వాల్సి ఇస్తోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

ఎల్ఆర్ఎస్ నిధుల ద్వారా రూ. 5కోట్ల పనులు అధికారులు చేయించారు. కానీ బిల్లులు మాత్రం ఇప్పించలేక పోయారు. మున్నేరు వరదల సమయంలోను కేఎంసీ కాంట్రాక్టర్లు కీలకంగా మానవతా దృక్పదంతో పనిచేశారు. పునరావాస కేంద్రాల నుంచి పారిశుధ్య పనులు, యంత్రాల నిర్వహణ వరకు రూ.4 కోట్లకు పైగా పనులు చేశారు. కానీ పైసా డబ్బులు రాలేదు. ఇలా పలు దశాల్లో కేఎంసీలో చేసిన పనులు రూ.60 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

ఫైల్ కదలటమే పెద్ద కష్టం

కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు పట్టే కాలం కంటే చేసిన పనులను కేఎంసీ అధికారుల వద్ద ఫైలింగ్ చేసేందుకు ఆరు నెలల కాలం పడుతోంది. ఒక పని జరిగిన తర్వాత దానిని ఇంజనీరింగ్ విభాగంలో రికార్డు చేయటం నుంచి ఆడిట్ విభాగం అప్రూవల్ వరకు సరైన విధానం అమలు కావటం లేదు. ప్రతి సెక్షన్‌లోను ఎవ్వరికి ముందస్తుగా కమిషన్లు ఇస్తే వారి ఫైల్ కదులుతోందనే విమర్శలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ఆడిట్ విభాగం నుంచి ఫైల్ క్లియర్ కావాలంటే నెలల తరబడి సమయం పడుతోందనే కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

మేయర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు... సమ్మె చేసేందుకు సిద్ధం

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాకపోవటంతో కేఎంసీలో పనిచేస్తున్న 25 మంది కాంట్రాక్టర్లు మూకుమ్మడిగా సమ్మెకు సిద్ధంగా ఉన్నారు. శుక్రవారం రాత్రి మేయర్ పునుకొల్లు నీరజను కాంట్రాక్టర్లు కలిసి తమ సమస్యలను తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ పనుల నుంచి మున్నేరు వరద పోటు పనుల వరకు మొత్తం రూ.60 కోట్లు బకాయిలు ఉన్నాయని వివరించారు. స్పందించిన మేయర్ పునుకొల్లు నీరజ సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్లు సమ్మెను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

క్రైం సమాచారం

చికున్‌గున్యాతో ఒకరి మృతి

వైరా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఐదోవార్డులోని తల్లపురెడ్డి సత్యనారాయణరెడ్డి(72)అలియాస్ బాలాజీ రేడియో చికున్‌గున్యా జ్వరంతో శుక్రవారం మృతిచెందాడు. గత 25రోజుల కిందట చికున్‌గున్యా జ్వరం బారినపడిన సత్యనారాయణరెడ్డి విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం ఉండదని డాక్టర్లు ఇచ్చిన సలహా మేరకు సత్యనారాయణరెడ్డిని వైరాలోని ఇంటికి తీసుకువచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వృద్ధురాలిని కట్టేసి బంగారు చైన్ చోరీ

వేంసూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి మెడలోని బంగారు చైన్‌ను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటనం వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన ప్రకారం మర్లపాడు గ్రామానికి చెందిన రామిశెట్టి రాములమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా బీసీ కాలనీలో ఉంటోంది. తన కుమార్తె, కుమారుడు జీవనోపాధి కోసం వేరే గ్రామంలో వేర్వేరు చోట్ల ఉంటున్నారు. వృద్ధురాలు మెడలో బంగారు గొలుసు ఉండటం చూసిన దుండగులు శుక్రవారం తెల్లవారుజామున ఆమె ఒంటిపై ఉన్న మూడు కాసుల బంగారు గొలుసును అపహరించారు.

తెల్లవారుజాము సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు కట్టేసి కత్తి చూపించి మెడలోని బంగారు గొలుసును తీసుకొని బైక్ పరారయ్యారని వృద్ధురాలు రాములమ్మ తెలిపింది. వృద్ధురాలి గొంతు వరకు గుడ్డలు కుక్కటంతోపాటు గట్టిగా చేతులను కట్టివేయడంతో తీవ్రగాయాలయ్యాయి. చేతులకు కట్టిన కట్లను ఊడతీసుకొని కేకలు వేయడంతో చుట్టుపక్కలు వారు వచ్చారని బాధితురాలు తెలిపింది. బాధితురాలు రాములమ్మ వేంసూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వీరప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

కొణిజర్ల,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న మండలంలోని పల్లిపాడు, కొణిజర్ల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పడి తీవ్రగాయాలతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన చల్లా శివకుమార్(28) శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం రోడ్డుపై ఉన్న గుంతల్లో ద్విచక్రవాహనంతో పల్టీ కొట్టిన శివకుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆటోలో సంచరించిన అపరిచితులు

ఖమ్మం క్రైం అక్టోబరు 18: అర్ధరాత్రి సమయంలో అపరిచిత వ్యక్తులు ఆటోలో సంచరించిన సంఘటన ఇటీవలే ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని 16వ డివిజన్ శ్రీరాంనగర్ 13, 14 రోడ్డులో ఈనెల 15న అర్ధరాత్రి సమయంలో కొంతమంది ఆటోలో వచ్చి ఆ ప్రాంతాల్లో తిరిగారు. అదే సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లేందుకు ఓ వక్తి రాగా వారిని ప్రశ్నించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చి కొద్ది దూరం వెళ్లి మళ్లీ వెనక్కి తిరగడంతో అపరిచత వ్యక్తులు పారిపోయారు. దీంతో సమీప ప్రాంతంలోని ఉన్న సీసీ కెమెరాలు రికార్డు కాగా కాలనీవాసులు ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మృతదేహం గుర్తింపు

ఖమ్మంక్రైం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): సాగర్‌కాలవలో గురువారం లభ్యమైన మృతదేహాన్ని ఆచూకీ లభ్యమైంది. టేకులపల్లి డబుల్‌బెడ్ రూంకు చెందిన తేజావత్ చరణ్ (30)గా గుర్తించారు. అతడు వేసుకున్న దుస్తుల ఆధారంగా మృతదేహాన్ని గుర్తించారు. కాగా ఈనెల 15న చరణ్ ఇంటినుంచి వెళ్లినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

డీఎంఎఫ్‌టీ నిధుల పక్కదారి

- నిబంధనలకు విరుద్ధంగా ఇతర పనులకు కేటాయింపులు
- రూ. 750 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలు
- పీఎం కేకేకేవై అధికారి కీలక సూత్రధారి..?
- నేడు భద్రాద్రి దిశ సమావేశంలో చర్చ

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): : మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో అభివృద్ధి, ప్రజా ప్రయోజనాల కోసం ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ యోజన (పీఎం కేకేకేవై) కింద నిధులు కేటాయిస్తారు. డిఎంఎఫ్‌టి (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ ట్రస్టు) ద్వారా ఈ నిధులను ఆయా పనులకు ఉపయోగిస్తారు. అయితే దాదాపు రూ.750 కోట్ల నిధులను అభివృద్ధికి కేటాయించకుండా అనాలోచితంగా ఖర్చు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు ప్రతిపాదనల మేరకు నిబంధనలను అనుసరించి నిధులను ఖర్చు చేయాలి. ఎక్కడా ఆ ప్రస్తావనే లేదు. 2015లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేయగా, 2017 నుంచి 2019 వరకు రూ.750 కోట్లలో రూ. 500 కోట్లను అనాలోచితంగా ఖర్చు చేసినట్లు వినికిడి.

కేంద్రప్రభుత్వ గైడ్‌లైన్స్‌లో లేకుండా కొవిడ్ సమయంలో రూ.250 కోట్లను ప్రభుత్వం తీసుకున్నట్లు అధికారిక గణాంకాలు ఉన్నప్పటికీ లెక్కల్లో స్పష్టత లేదు. ఖనిజ క్షేత్ర కళ్యాణ యోజన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అన్ని శాఖలకు నిధుల కేటాయింపులు జరపాలి. 2020-22 మధ్యకాలంలో అప్పటి పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గైడ్‌లైన్స్ పాటించకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు వినికిడి. జిల్లా ఇంచార్జ్ మంత్రి చైర్మెన్ గా, కలెక్టర్ కన్వీనర్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీఓ) కోశాధికారిగా ఉండే డిఎంఎఫ్‌టి ద్వారా నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా ఖర్చు చేయడం కొసమెరుపు.

జిల్లాలో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళలు, పిల్లల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, పారిశుధ్యం వంటి రంగాల్లో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి అభివృద్ధి పనులు చేపట్టాలి. మైనింగ్ వనరులు తరలించుకుపోవడం వల్ల వచ్చే ఆదాయంలో 30 శాతం సీనరేజీ సొమ్మును డీఎంఎఫ్‌టీ కి కేటాయించాలని, ఈ నిధులను మైనింగ్ ప్రభావిత ప్రాంతాలకు మాత్రమే ఖర్చు చేయాలని నిబంధనలున్నాయి. కానీ గైడ్‌లైన్స్ లేకుండా కొవిడ్ సమయంలో రూ. 250 కోట్లు, రాష్ట్ర పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ సుమారు రూ.100 కోట్లు, అర్అండ్‌బీ శాఖకు సుమారు రూ. 100 కోట్లు ఇచ్చారు.

2017లో ఈ పథకం ప్రారంభమైనప్పటినుంచి ఖనిజ క్షేత్ర కళ్యాణ యోజన వెబ్‌సైట్‌లో ఆన్లైన్ చేయాలని ఉంది. జిల్లాలోని డీఆర్‌డీఓ కార్యాలయంలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని ఆన్‌లైన్ నమోదు కోసం వరంగల్, హైదరాబాద్‌కు పంపించి శిక్షణ ఇచ్చారు. అయితే తర్వాత ఆ ఉద్యోగి జాబ్ మానేసింది. నాటినుంచి ఆన్‌లైన్ ప్రక్రియ అటకెక్కింది. అధికారిక గణాంకాల ప్రకారం 4,520 పనులు శాంక్షన్ అయ్యాయి. వీటిలో 221 పనులు ప్రారంభానికి నోచుకోలేదు. 1,077 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,803 పనులు పూర్తయ్యాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన డీఎంఎఫ్‌టీ సమావేశం ప్రారంభం నాటినుంచి రెండు సార్లు ఏర్పాటుచేసి శాంక్షన్ పనులకు అప్రూవల్ చేశారు. ఆ తరువాత నుంచి చర్చ, అనుమతి లేకుండా పనుల శాంక్షన్, అప్రూవల్స్ చేశారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో యాక్టివిటీతో వచ్చే ఇబ్బందులు తొలగించేందుకు హెల్త్, ఎడ్యుకేషన్, శానిటేషన్ కార్యక్రమాలకు ఖర్చు చేయలేదు. వైద్యశాలల నిర్మాణం ల్యాబ్ పరికరాలు, వైద్యుల నియామకం, తదితరాలకు ఖర్చు చేయాల్సిన నిధులను కాంట్రాక్టర్లు, అధికారులకు స్వలాభాపేక్షతో ఉండే పనులకు శాంక్షన్ చేసి ముందస్తు బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై పర్యవేక్షణ లేదు. పనుల క్వాలిటీ చెకింగ్ చేయకుండానే బిల్లులు చెల్లించారు. జిల్లాలో జరుగుతున్న పనుల వివరాలు ప్రత్యేక అధికారులకు సమాచారం లేదు. గత డీఆర్‌డీఓ, పంచాయతీరాజ్ అధికారుల సమయంలో శాంక్షన్ చేసి నిర్మాణం పూర్తయిన పనులపై సమగ్ర విచారణ నిర్వహిస్తే అవినీతి అధికారుల బండారం బహిర్గతమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పాతకక్షలతో జర్నలిస్టుపై దాడి



గాయపడిన సుదర్శన్

ఇల్లెందు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం జగదాంబగుంపు సమీపంలో గురువారం రాత్రి ఇల్లెందులో ఓ పత్రికా విలేకరిపై కొందరు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనకు పాత కక్షలే కారణమని తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్లితే.. ఇల్లెందు మండలం రాఘబోయినగూడెం గ్రామానికి చెందిన సుదర్శన్ విలేకరిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి జగదాంబగుంపు గ్రామ సమీపంలో ఓ కిరాణా షాపు వద్ద ఉండగా కొందరు వ్యక్తులు వచ్చి దాడికి దిగారు. ఖాళీ బాటిళ్ల, కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో సీఐ బత్తుల సత్యనారాయణ ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. స్థానికంగా వున్న కొందరు వ్యక్తులు వ్యక్తిగత కక్షలతో సుదర్శన్‌పై దాడికి దిగినట్టు చెబుతున్నారు. బాధితుడు ఆస్పత్రిలో ఉండటంతో నిందితులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదు.

గోదావరిలో నలుగురిని కాపాడిన ఫొటోగ్రాఫర్



కుటుంబ సభ్యులను ఒడ్డుకు చేర్చిన దృశ్యం

భద్రాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి నదిలో శుక్రవారం స్నానం చేసేందుకు దిగిన నలుగురు ప్రమాదశాత్తు కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న ఫొటోగ్రాఫర్ ఇచ్చాపురపు లక్ష్మణరావు కాపాడిన సంఘటన ఇది. ఇల్లెందుకు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనానికి వచ్చి ముందుగా గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. ఈ సమయంలో నదిలో లోతును అంచనా వేయలేక మునిగిపోతూ కేకలు వేశారు. అక్కడే సమీపంలో ఫోటోలు తీస్తున్న లక్ష్మణరావు అనే ఫొటోగ్రాఫర్ నదిలోకి దిగి వారిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. లక్ష్మణరావు గజ ఈతగాడు కావడంతో కుటుంబ సభ్యులంతా ప్రాణాలతో బయటపడటాన్ని పలువురు భక్తులు అభినందించారు. ఈ సంఘటనతో భయాందోళనకు గురైన ఇల్లెందుకు చెందిన కుటుంబ సభ్యులు వెంటనే అక్కడ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఆకుటుంబ వివరాలు ఎవరికి తెలియ లేదు. అలాగే లక్ష్మణరావుకు చెందిన కెమెరా, మొబైల్ ఫోను నీటిలో తడవడంతో మరమ్మతుల కోసం ఖమ్మానికి వెళ్లారు.

అత్తింటి ముందు కోడలి నిరసన



ఖమ్మంక్రైం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తన భర్త చనిపోయాడని తనకు, తనపిల్లలకు న్యాయం చేయాలంటూ అత్త,మామల ఇంటిముందు కోడలు నిరసనకు దిగిన సంఘటన శుక్రవారం ఖమ్మం నగరంలో జరిగింది. ముదిగొడ మండల పండ్రేగుపల్లికి చెందిన షేక్ జరీనాకు ఖమ్మం నగరంలోని సుందరయ్యనగర్‌కుచెందిన షరీఫ్‌తో 2020లో వివాహం జరిగింది. వీరికి కుమార్తె కూడా ఉంది. 2022లో వైరల్ జ్వరంతో షరీఫ్ మృతి చెందాడు. భర్త మృతిచెందిన కొతకాలం పాటు అత్తామామలు మంచిగానే చూసుకోగా కొద్దినెలల నుంచి తనకు హక్కులేదని బయటకు గెంటేశారంటూ బాధితురాలు తెలిపింది. వివాహ సమయంలో పుట్టింటి నుంచి రూ.10లక్షల నగదు , పదితులాల బంగారంతో పాటు ఇంటికి సంబంధించిన వస్తువులు కొన్ని ఇచ్చారు. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా పుట్టిన పాపతో సైతం తమకు సంబంధం లేదని చెబుతున్నారని బాధితురాలు తెలిపింది. అదేవిధంగా గతంలో పోలీసుకమిషనర్ కార్యాలయంలో, త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు తన అత్తామామలను పిలిపించి మాట్లాడగా తనకు సంబంధించినవి ఇస్తామని ఒప్పుకుని ఇప్పుడు ఏం చేసుకుంటారో చేసుకోమంటున్నారని బాధితురాలు వాపోయారు. దీంతో తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అత్తామామటల ఇంటిముందు నిరసనకు దిగారు. విషయం తెలిసిన త్రీటైన్ పోలీసులు సంఘటనస్థలం వద్దకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి వారిని అక్కడినుంచి పంపించారు. కాగా సమస్య పరిష్కారమైనట్లు తెలిసింది.

ఆలయ తలుపులు మూసిన ఘటనపై సీరియస్

భద్రాచలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు ఆలయాల గ్రిల్స్‌కు తాళం వేసిన ఘటన విమర్శలకు తావిచ్చింది. దీంతో భద్రాద్రి దేవస్థానం అధికారులు ఈ ఘటనపై విచారణ చేపట్టనున్నారు. ఇందుకోసం విచారణాధికారిగా ఏఈవో భవానీరామకృష్ణారావును నియమించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికను దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదించనున్నట్లు తెలుస్తోంది.

ఆలయంలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనల క్రమంలో ఈ ఘటన ఉద్దేశ్యపూర్వకంగానే జరిగిందా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో ఇటీవల శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించిన క్రమంలో తాత్కాలిక వైదిక సిబ్బందిని తీసుకోగా శబరి స్మృతి యాత్ర సమయంలో వీరి అవసరం ఉంటుందని వైదిక పెద్దలు ముందుగా అధికారుల దృష్టికి తేకపోవడం వలన సమస్య తలెత్తిందనే వ్యాఖ్యలు సైతం వినిపిస్తున్నాయి. ఈ విషయంపై భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా విచారణాధికారిగా ఏఈవో భవానీరామకృష్ణారావును నియమించిన మాట వాస్తవమేనన్నారు. ఏఈవో విచారణ అనంతరం నివేదికను దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు.



రేపు గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ సంఘం ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న వెంకటరమణ

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): 'ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకట రమణ తెలిపారు. శుక్రవారం నగరంలోని హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సెప్టెంబరు 28న నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులకు ఎన్నికల అధికారి నేరళ్ళ శ్రీనివాస్ నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రానైట్ సబ్సిడీలకు ఇచ్చిన రూ.22 కోట్ల చెక్కులు నేటికీ క్లియర్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గ్రానైట్ సమస్యలు తీరి పరిశ్రమ కుదుట పడుతుందని ఆశిస్తున్నామన్నారు. నూతన అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, ఇకనుంచి గ్రానైట్ యజమానులంతా ఒకే కుటుంబంలా ముందుకు పోతామన్నారు. ఈ సమావేశంలో అసోషియేషన్ ట్రెజరర్ రాకేష్, నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రధాన కార్యదర్శి కమర్తపు గోపాల్‌రావు, కోశాధికారి మారంరెడ్డి పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు 12 కొనగంచి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, తమ్మినేని సాగర్, ఈసీ మెంబర్ దొండేటి స్వేధన్ పాల్గొన్నారు.

టిఫా.. టఫా!

- ప్రభుత్వాసుపత్రిలో పనిచేయని స్కానింగ్ మిషన్
- రేడియాలజీ లేక గర్భిణుల ఇక్కట్లు

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఏడాదిన్నర క్రితం ప్రారంభించిన టిఫాస్కానింగ్ మిషన్లు మూలనపడ్డాయి. గత ప్రభుత్వ హాయంలో జిల్లా ఆస్పత్రిలో అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించిన టిఫా (టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫ్యూటల్ ఎనామిలీస్) స్కానింగ్ మిషన్ మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. రాష్ట్రంలోని వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రుల్లో వీటిని ఏడాదిన్నర క్రితం అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.29 లక్షల విలువైన ఈ పరికరాన్ని ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు.అప్పటి వరకు టిఫా స్కానింగ్ కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. అంతే కాదు ఒక్కోస్కానింగ్‌కు కనీసం రూ.3 వేల నుంచి రూ.4వేలు వసూలు చేసేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా ఈ సేవలు అందించాలన్న లక్ష్యంతో టిఫా స్కానింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా ఆస్పత్రికి రెండు టిఫా స్కానింగ్ మిషన్లు వచ్చినప్పటికీ రెండో మిషన్‌లో.. సాంకేతిక లోపాలు తలెత్తడంతో అదిమూలన పడింది. గర్భిణుల కడుపులో పిండం ఎదుగుదల, ఎదుగుదలలో లోపాలు ఉన్నా.. ఆరోగ్యకరంగా ఉందా లేకుంటే ఏమైనా లోపాలు ఉన్నాయో లేనిదీ ఈ స్కానింగ్ ద్వారా స్పష్టంగా గమనించేందుకు టిఫా మిషన్లను ఉపయోగపడతాయి. 5నెలల నుంచి 6నెలలు నిండిన గర్భిణులకు మాత్రమే ఈ స్కానింగ్‌ను తీస్తారు. ఉన్న ఒక్క మిషన్‌పైనే ఇటీవల రోజుకు కనీసం 4 నుంచి 6స్కానింగ్‌లు చేసేవారు. ప్రతి రోజు కనీసం 10 నుంచి 15 మందికి ఈ స్కానింగ్ అవసరం ఉంటుంది. రెండు మిషన్లు ఉన్నా.. మరోకటి పనిచేయకపోవ డంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. వారివంతు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మిషన్ ప్రారంభించిన నాలుగు రోజులకే పనిచేయక పోవడం వలన ఎంతో ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా రేడియాలజిస్ట్, డాక్టర్‌ను టిఫా కేంద్రంలో నియమించి తక్షణమే రెండో మిషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, మహిళలు కోరుతున్నారు.



టిఫా మిషన్ గదికి తాళం వేసిన దృశ్యం



మూలనపడిన టిఫా మిషన్

కోడింగ్‌లో హార్వెస్టు విద్యార్థిని ప్రతిభ



ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎన్‌జీఓ అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి వెబ్‌డిజైనింగ్, కోడింగ్ పోటీల్లో నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థిని షణ్ముక ప్రియ ప్రథమస్థానంలో నిలిందని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. అక్టోబరు 10న ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఫలితాల్లో రాష్ట్రం నుంచి మొదటి స్థానం సాధించినట్లు చెప్పారు. నేషనల్ టాలెంట్ అవార్డు 2024 సాధించిన విద్యార్థినిని వారు అభినందించారు. కోడింగ్ ప్రోగ్రాంలో జాతీయ స్థాయి అవార్డు సాధించిన షణ్ముఖప్రియను శుక్రవారం ఆర్‌జేసీ విద్యాసంస్థ చైర్మన్ గుండాల కృష్ణ అభినందించారు.

నిజాయితీగా పని చేయాలి

- మనం ప్రజల కోసం మాత్రమే ఉన్నాం
- పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- తహసీల్దార్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉద్భోదించారు. శుక్రవారం కలెక్టర్‌లో పెండింగ్ రెవెన్యూ అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి తహసీల్దార్, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు, పెండింగ్ మీ సేవా దరఖాస్తులు, ధరణి దరఖాస్తులు, పెండింగ్ మ్యూటేషన్, ప్రభుత్వ స్థలాలు, కోర్టు కేసులు అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు పెండింగ్ ఉండటానికి వీలు లేదని, పలుమార్లు చెప్పినప్పటికీ దరఖాస్తులు పెండింగ్ ఉండటం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో తహసిల్దార్లు అలసత్వం వహిస్తున్నారని, ఇదే ధోరణి కొనసాగితే జిల్లాలో పని చేయాల్సిన అవసరం లేదన్నారు. ఖమ్మం రూరల్ మినహా మిగిలిన మండలాల తహసీల్దార్లు, వరదల నేపథ్యంలో సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి జారీ చేయడంలో ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిసిందన్నారు. ప్రజల పట్ల మానవతా కోణం లేకుండా పని చేయడం దారుణమన్నారు. మనం ప్రజల కోసం మాత్రమే ఉన్నామని, ప్రజల కంటే మేం గొప్ప అనే భావన ఉంటే వెంటనే దానిని తొలగించుకోవాలన్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని నిజాయితీతో పని చేయాలని ఆదేశించారు. నెలల తరబడి పెండింగ్ దరఖాస్తులు ఒకే రోజులో పరిష్కరిద్దాం అనుకునే దృక్పథం మారాలని, ఏ రోజు పని ఆ రోజు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ధరణి సంబంధించి పెండింగ్ దరఖాస్తులు, ఎందుకు పెండింగ్ ఉన్నాయో కారణాలు తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. బల్క్ సమస్యలు ఉంటే ముందుగా వాటిని పరిష్కరించాలని అన్నారు. రెవెన్యూ శాఖ, తహసిల్దార్ పని తీరుపై మంచి స్పందన లేదని అన్నారు. నిజాయితీతో పనిచేసే ఉద్దేశం ఉంటేనే ఖమ్మంలో పని చేయాలని, అవకతవకలకు పాల్పడాలనే ఆలోచన వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినికి కలెక్టర్ గిఫ్టు

సొంత ఖర్చులతో ల్యాబ్‌ట్యాప్ వితరణ



విద్యార్థినికి ల్యాబ్‌ట్యాబ్ అందిస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మనకు ఎవ్వరు లేరు, ఎవరు తోడ్పాటు అందించరు అనే భావన మనస్సు నుంచి తీసివేయాలని, జిల్లా యంత్రాంగం మీ వెంట ఉందని అన్నివిధాలా తోడ్పాటు అందిస్తారని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలుక్టర్ ముజామ్మిల్‌ఖాన్ నగరంలోని బాలల సదనవ సందర్శించారు. బాలల సదనంలో ఉంటూ సత్తుపల్లి సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కె కావ్యకు ల్యాబ్‌ట్యాబ్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, విష్ణువందన, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు.. రేపు

నేడు షూటింగ్, స్క్వాష్ క్రీడా ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో శనివారం అండర్-14, 17 బాల, బాలికలకు షూటింగ్, స్క్వాష్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎజీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి ఎంపికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

సాయిబాబా సంస్మరణ సభ..

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ శనివారం సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగనున్నది. ప్రత్యామ్నాయ పౌర సమూహం (సీసీపి) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఉపాధ్యాయులు, తదితర అభ్యుదయవాదులు పాల్గొని ప్రసంగించనున్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ అండర్- 14 ఖో-ఖో ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి 30 వరకు కామారెడ్డిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాలుర, బాలికల ఖో-ఖో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఆదివారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు ఎజీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర సమాచారం కోసం 8019952592 నెంబరును సంప్రదించాలని కోరారు.

'హోలికులు సేమమా' నాటిక ప్రదర్శన..

ఖమ్మంసాంస్కృతికం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో హోలికులు సేమమా నాటికను ప్రదర్శించనున్నట్లు నెలనెల వెన్నెల నిర్వాహకులు ఎఎస్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిఅవార్డు గ్రహీత దేవేంద్ర దర్శకత్వంలో నాటికను ప్రదర్శిస్తారని తెలిపారు. నాటక ప్రియులు విజయవంతం చేయాలన్నారు.

గంగవరపు విజయ్ కుమార్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఖమ్మంరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): పేదప్రజల పక్షపాతి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ గంగవరపు విజయ్ కుమార్ పోరాట స్ఫూర్తితో నేటియువత ముందుకు సాగాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెంలో గంగవరపు విజయ్ కుమార్ 26వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ సాయుధ పోరాటం కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాట పటిమతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిటీ సభ్యులు మౌలానా, వెంకటరెడ్డి, కమలాకర్, రాంమూర్తి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- అభివృద్ధి పనులు తనిఖీ చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఎన్నికల ముందు జరిగిన పనులను 59, 60 డివిజన్లలో కమిషనర్ అభిషేక్ అగస్త్య 9 పనులను తనిఖీ చేశారు. రహదారులను తవ్వీ నాణ్యతను తనిఖీలు చేశారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్తకుప్పలను తొలగించాలని పారిశుధ్య కార్మికులను హెచ్చరించారు. ట్రాక్టర్లు రోజువారీగా వస్తున్నాయా.. అని సమీపంలోని నివాసాల వారితో మాట్లాడి తెలుసుకున్న ఇంజనీరింగ్ ఈఈ కృష్ణలాల్, డీఈ ధరణి తదితరులు పాల్గొన్నారు.



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

వరద బాధితులకు కేంద్రం సాయం మంజూరు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మంటౌన్,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద బాధితుల గురించి బీజేపీ నాయకులు మొసలి కన్నీళ్ల కార్చటం కాదని కేంద్రం ద్వారా సాయం మంజూరు అయ్యేలా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆగస్టునెలలో వచ్చిన మున్నేరు, ఆకేరు, బుగ్గవాగు, పాలేరు వరదల వల్ల 22వేల కుటుంబాలు సర్వం కోల్పోయారని, ఒక్క ఖమ్మం నగరంలోనే 10వేల కుటుంబాలు నిరాశ్రయులు అయ్యారని పేర్కొన్నారు. కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు, కేంద్రప్రభుత్వ అధికార బృందాలు పర్యటనలు చేసి, ఓదార్పు మాటలు చెప్పారని, ఇప్పటి వరకు పైసా సాయం చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసి రూ.11500 కోట్లు అడిగితే కేంద్రం కేవలం రూ.140 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. వరద బాధితులకు సాయంపై బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు.

పరిశుభ్రతే తొలి ప్రాధాన్యం

- కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్‌షఫి ఉల్లా

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): తనకు ఉన్న పరిపాలన అనుభవంతో నగరంలో పారిశుధ్య పనులు నిర్వహించటమే తొలి ప్రాధాన్యతని ఖమ్మం నగర పాలక సంస్థ నూతన అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్‌షఫి ఉల్లా పేర్కొన్నారు. మధిర పురపాలక సంస్థ కమిషనర్ నుంచి కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కోర్టు కేసులు పరిష్కారం, పరిపాలనలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని చెప్పారు. అనంతరం తనను కలిసేందుకు వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లుతో పరిచయం చేసుకున్నారు. పారిశుధ్య అవగాహనపై ప్రశ్నించారు. జాయినింగ్ సమయంలోను సీటీసీపై సంతకం చేసే ముందు రూల్ పొజిషియన్ ఇస్టాబ్లిల్‌మెంట్ ఉద్యోగికి వివరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అహ్మద్‌షఫి ఉల్లా

నూతన విద్యావిధానం రద్దుకు ఉద్యమించాలి

ఖమ్మంటౌన్,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానం రద్దుకోసం విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు.శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. యూనివర్శిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పోరేటీకరణ, ప్రయివేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తారని విమర్శించారు. జాతీయ విద్యావిధానంలో ఎక్కడా ఉచిత విద్య అనే పదాన్ని పొందు పరచలేదన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, వంశీ, నాయకులు రాకేష్, ప్రతాప్, సునీల్, రోహిత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం సరికాదు

రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలు చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ప్రకటించటం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు విద్యావిధానాన్ని ప్రోత్సహించి, వ్యాపారమయం చేయటమే నూతన విద్యావిధానం లక్ష్యమన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్-17 టీటీ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో అండర్- 17 బాల, బాలికల టేబుల్ టెన్నీస్ జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 90 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపి క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తెలిపారు.

మద్దులపల్లి మార్కెట్‌ను త్వరితగతిన వినియోగంలోకి తీసుకు రావాలి: చైర్మన్

ఖమ్మంరూరల్,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మద్దులపల్లి మార్కెట్ యార్డును త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని మార్కెట్ చైర్మన్ బైరు హరినాథబాబు అధికారులకు సూచించారు. మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. మార్కెట్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి యం.ఏ.అలీమ్, డీఈఈ ఎల్లెష్, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా వీరస్వామి



కొణిజర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన చిలుకూరి వీరస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల మహసభలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా వీరస్వామి, ప్రధానకార్యదర్శిగా మాదాల ప్రసాద్‌రావు, కోశాధికారిగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా రత్నసుశీలరాణి, పాటి శ్రీనివాస్‌తో పాటు మరికొంతమందిని కార్యవర్గం సభ్యులుగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి/ముదిగొండ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరిగూడెం 33/11కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, కిన్లే ఫ్యాక్టరీ ఏరియా, సిద్దారం మెయిన్ రోడ్, రాజీవ్‌నగర్‌లలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెనుబల్లి (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఏఈ రవితేజ తెలిపారు. పెనుబల్లి, వీఎంబంజర్, రామచంద్రరావుబంజర్, ఎడ్లబంజర్, రంగారావుబంజర్, సీతారాంపురం, బయ్యన్నగూడెం, నాయకులగూడెం, మొండికుంట గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

ముదిగొండ (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో 33/11కేవీ లక్ష్మీపురం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ బి.రామకృష్ణ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

» చెట్ల కిందనే పాఠాలు
» ఆందోళనలో విద్యార్థులు
» కొత్త లంకపల్లి పాఠశాల దుస్థితి



చెట్ల కిందనే విద్యనభ్యసిస్తున్న కొంతమంది విద్యార్థులు



భవనం పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

పెనుబల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు విద్యనందించేందుకు ఏర్పాటు చేసిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినప్పటికీ నూతన భవన నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మండల పరిధిలోని కొత్తలంకపల్లి ప్రాథమిక పాఠశాలలో సుమారు 30మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత మూడేళ్ల క్రితం గ్రామం నుంచి కొత్తగూడెం- సత్తుపల్లి రైల్వేలైన్ ఏర్పాటు కావడంతో సత్తుపల్లి-పెనుబల్లి జాతీయ రహదారిపై వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో పాఠశాల భవనం రహదారి కంటే 15అడుగుల లోతులో ఉంది. దీంతో పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఈ పాఠశాలలో పూర్తిగా గిరిజన విద్యార్థులే విద్యనభ్యసిస్తున్నారు. చదువుల్లో సైతం ఆంగ్లంలో బోధన చేస్తుండటంతో విద్యార్థులు ఆంగ్ల బాషపై పట్టు సాధించారు. కానీ గత 20ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి కిందపడిపోతుంది. దీంతో పాఠశాలలోని కొందరు విద్యార్థులను భవనంలోనూ మరికొంతమందిని చెట్ల కిందనే కూర్చో బెట్టి విద్యాబోధన చేస్తున్నారు. గ్రామంలోని పెద్దలు కొందరు పాఠశాల భవనాన్ని వేరే ప్రాంతంలో నిర్మించాలని దాతల నుంచి స్థలాన్ని సేకరించారు. దాని నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.8లక్షలను కేటాయించారు. ఆనిధులతో భవన నిర్మాణం కాదనే ఉద్దేశ్యంతో మరికొన్ని నిధులు కావాలని భవన నిర్మాణం కూడా చేపట్టలేదు. దీంతో విద్యార్థులు ఎండనైనా, వాననైనా శిథిలావస్థ భవనంలోనే విద్యనభ్యసించాల్సి వస్తుంది. పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైరా అభివృద్ధికి సీఎం హామీ: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



సీఎం రేవంత్‌తో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. గురువారం రాత్రి సీఎంను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారు. సింగరేణి మండలానికి సింగరేణి నుంచి రావల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, సీతారామ ప్రాజెక్టు రాజీవ్ లింకెనాల్ కోసం భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం వెంటనే ఇప్పించాలని ఎమ్మెల్యే కోరగా సీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు ఉచిత చేపపిల్లల విడుదల

వైరా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌లో శనివారం ఉచిత చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని చేపల సొసైటీ అధ్యక్షుడు షేక్ రహీం తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి చేతులమీదుగా ఉదయం 11గంటలకు చేపపిల్లలు విడుదల చేస్తారని మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తాగునీటి సరఫరాలో పంపు ఆపరేటర్లే కీలకం: డీఈ



తల్లాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ద్వారా జరిగే తాగునీటి సరఫరాలో పంపు ఆపరేటర్లే కీలకమని మిషన్ భగీరథ సత్తుపల్లి డీఈ జయలక్ష్మీ అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం మల్లవరం గ్రామంలోని రైతువేదికలో నాలుగురోజులపాటు పంపు ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యుత్ మోటర్లు, పైపులైన్ల మరమ్మతులు, తాగునీటి సరఫరా పరీక్ష, చేతిపంపుల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో కొండపల్లి శ్రీదేవి, ఏఈ సింధు, వర్క్ఇన్‌స్పెక్టర్ బొగ్గుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు: ఈఈ

ఏన్కూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు చేపడుతున్నట్టు మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ తెలిపారు. శుక్రవారం స్థానిక రైతువేదికలో గ్రామ మంచినీటి సహాయకుడి ముగింపు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ పొందిన సహాయకులకు సర్టిఫికెట్లు అందించారు. ఆమె మాట్లాడుతూ నీటి నాణ్యత, హ్యాండ్ పంపు, మోటారు పంపుసెట్, పైపులైన్ లీకేజీ మరమ్మతులపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, డీఈలు హరి, నరసింహారావు, ఏఈ సురేష్, సూపర్‌వైజర్ శరత్, ఎంపీవో జీవీఎస్ నారాయణ పాల్గొన్నారు.

గంజాయి అమ్మినా, వినియోగించినా చర్యలు: ఎస్‌ఐ

మధిరటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో ఎవరైనా గంజాయి అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని మధిర టౌన్ ఎస్‌ఐ సంధ్య హెచ్చరించారు. శుక్రవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్న పాత నేరస్తులకు కౌన్సిలింగ్ చేశారు. గంజాయి వాడటం వలన మానసిక నిబ్బరాన్ని కోల్పోతారని మత్తులో ఏమి చేసేది తెలవదని దీని వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. గంజాయి వినియోగించినా, అమ్మినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసు నమోదైతే యువత ఉద్యోగాలకు అనర్హులు అవుతారని హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక

ఏన్కూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం గ్రామ పంచాయతీ కార్యదర్శులు మండల అధ్యక్షుడిగా బానోతు రవికుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్, ఎంపీవో జీవీఎస్ నారాయణ సమక్షంలో కార్యవర్గ ఏర్పాటు జరిగింది. ఉపాధ్యక్షుడిగా కేంద్ర మాధురి, జనరల్ సెక్రటరిగా కంచర్ల కోటేశ్వరరావు, కోశాధికారిగా పొలగాని భార్గవ్, ఆర్గనైజింగ్ సెక్రటరిగా లకావత్ సురేష్, గౌరవాధ్యక్షుడిగా రామ్‌కి కార్యవర్గ సభ్యులుగా అమల, రోజా, దీప్తి, విజయలక్ష్మి, అనూష, కవిత, పుష్పరాణి, సురేష్, షైబూబీ, అసిఫ్, సుస్మిత, విజయ, రాంప్రసాద్, అనిల్, నాగేశ్వరరావు, సీతారాములు, ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో అభినందించారు

బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని ఆందోళన

ముదిగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ-వల్లభి రహదారిపై చిరుమర్రి తాళ్ల వాగు వద్ద నిర్మించనున్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. రహదారిపై బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పక్కన నిర్మించిన సర్వీస్ రోడ్డుపై గుంతలేర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం మొదలుపెట్టి ఆరునెలలవుతున్నా పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో కోలేటి ఉపేందర్, అరుణ, రామయ్య, టీఎస్.కల్యాణ్, రాము, నాగేశ్వరరావు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల కల నెరవేరే సమయం

» మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గురుమూర్తి » 26న మాదిగ సమ్మేళనం



మాట్లాడుతున్న గురుమూర్తి

వైరా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య న్యాయ కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని మాదిగ జేఏసీ ఉమ్మ డి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ మట్టే గురుమూర్తి పేర్కొన్నారు. మాదిగల 30ఏళ్ల కల నెరవేరే సమయం వచ్చిందని అందుకు మాదిగలంతా రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. ఈనెల 26న జరిగే మాదిగ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో జరిగిన మాదిగ జేఏసీ వైరా నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని కూసుమంచి, వైరా, భద్రాచలంలలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి మాదిగ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని వీటిని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం కార్యాచరణ తీసుకుంటున్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశారని ఆరోపిస్తూ మంద కృష్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యాచరణ తీసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. వ్యక్తిగత లాభాల కోసం మాదిగజాతి ప్రయోజనాలను పణంగా పెట్టకూడదని హిత వు పలికారు. డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వం లో మాదిగ సమ్మేళనాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు.

బోనకల్ ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రమాదేవి

బోనకల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బోనకల్ ఎంపీడీవోగా ఆర్. రమాదేవి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు వేంసూరు మండలంలో పని చేసిన ఆమె బదిలీ పై బోనకల్‌కు వచ్చారు. ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. మండల అభివృద్ధి కోసం అంకిత బావంతో పని చేస్తానని తెలిపారు. అందరూ సహకరించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం: ఎమ్మెల్యే



విద్యుత్ మోటార్లను అందజేస్తున్న ఎమ్మెల్యే డా.రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ రాబోయే కాలంలో అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. రూ.75లక్షల సింగరేణి నిధులతో మండలంలోని సత్యంపేట, బాసారం, కొమ్ముగూడెం, రుద్రాక్షపల్లి గ్రామాలలోని రైతులకు 30విద్యుత్ మోటార్లను రుద్రాక్షపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. నిధులు ఒకొక్కటిగా సమకూర్చుకుంటూ ప్రజాఅవసరాలను తీర్చుకుంటున్న ప్రభుత్వానికి మున్ముందుకు మద్దతు తెలపాలని, వచ్చే అన్ని ఎన్నికలలో ప్రభుత్వానికి అండగా నిలిచేవారినే గెలిపించుకుంటే గ్రామాలలో అభివృద్ధి సాధ్యమవుతందన్నారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు, ఎంపీడీవో నాగేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం సత్తుపల్లిలోని మునిసిపాలిటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే డా.రాగమయి ఆకస్మికంగా తనిఖీ చేసి కమిషనర్ మందా రవిబాబుకు పలు సూచనలు చేశారు.

పత్తి, మిరప పంటల పరిశీలన

కారేపల్లి అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గేటురేలకాయలపల్లిలో శుక్రవారం వైరా కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త పిఎస్‌ఎం ఫనీశ్రీ, వైరా డివిజన్ ఏడీఏ కరుణశ్రీ, మండల వ్యవసాయశాఖ అధికారి బట్టు అశోక్ పత్తి, మిరప పంటలను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. పురుగుల మందులను ఎలా పిచికారి చేయలనే పద్దతిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.నరేష్ పలువురు రైతులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు ఆర్థికసాయం అందజేత



రూ.పదివేల ఆర్థికసాయం అందజేస్తున్న క్లబ్ నిర్వాహకులు

వైరా/సత్తుపల్లి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న మాగంటి మధురకు కాలేజ్ ఫీజుల నిమిత్తం రూ.పదివేల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ కాపా మురళీకృష్ణ, మన్నే కృష్ణల సహకారంతో శుక్రవారం అందజేశారు. ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి అనేది ఎంతో పవిత్రమైందని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను దాతలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్, నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, లగడపాటి ప్రభాకర్‌రావు, గంగవరపు కిషన్, జాలా పుల్లారావు, ఉయ్యూరు రామకృష్ణ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన స్థానిక గుడిపాడుకు చెందిన రాజిన్ని ప్రసాద్, నాగమణి దంపతుల కుమార్తె శివభార్గవికి దాతల నుంచి ఆర్థిక సాయం అందుతుంది. మండలంలోని కిష్టారానికి చెందిన లారీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు కుమార్తె నవ్యశ్రీ, అశోక్ దంపతులు శుక్రవారం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, సింగరేణి రవి తదితరులున్నారు. అదేవిధంగా ఖమ్మం పట్టణానికి చెందిన పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు పరిశ పుల్లయ్య రూ.25వేల ఆర్థిక సహాయాన్ని కల్లూరు ఏసీపీ ఏ.రఘు చేతులమీదుగా విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, వాసిరెడ్డి మధుసూదనరావు, చెన్నారెడ్డి, పూర్ణచంద్రరావు, మధుసూదనరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

కల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థి సయ్యద్ వసీముద్దిన్‌ను ఘనంగా సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి నందిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది వసీముద్దిన్‌ను ఘనంగా సత్కరించారు. వసీముద్దీన్ తండ్రి పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్ కార్మికుడిగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ రికార్డు అసిస్టెంట్ సామేలు, బిల్‌కలెక్టర్ అబ్దుల్ మాలిక్, అంగన్వాడి టీచర్లు ఆషాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో భరత్ విద్యార్థినుల ప్రతిభ

మధిర, అక్టోబరు 18: జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన తమ విద్యార్థినులకు భరత్ విద్యాసంస్థల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి బంగారు పతకాలను బహూకరించారు. శుక్రవారం విద్యాసంస్థలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు తల్లపురెడ్డి రమ్య, బాజినేని చంద్రిక, వేమిరెడ్డి లాస్య మండల, జోన్, జిల్లా స్థాయిలలో విశేష ప్రతిభ కనబర్చి పాఠశాల ఖ్యాతిని నిలిపారని డైరెక్టర్ వెంకటరెడ్డి ప్రశంసించారు. వీరిని అభినందిస్తూ బంగారుపతకాలను, మెమెంటోలను బహూకరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, స్రవంతి, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న దృశ్యం